నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా తదితరులు

అబిడ్స్: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలను గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. సోమవారం టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, ఇతర రాష్ట్ర నాయకులు కుమార్ రావు, విజయవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రామిరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నం జీవరెడ్డి దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

పోస్టాఫీస్‌ను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలి


డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆఫీసర్ ఆర్మూగంకు వినతిపత్రం అందజేస్తున్న బుచ్చిరెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: చందానగర్‌లోని పోస్టాఫీస్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆఫీసర్ బి.ఆర్మూగంకు టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు పోరెడ్డి బుచ్చిరెడ్డి కోరారు. పోస్టాఫీస్ మొదటి అంతస్తులో ఉండటం వలన ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవులను అమ్మితే చర్యలు

మణికొండ: బక్రీద్ పండగను పురస్కరించుకుని పశువ్యాపారులు ఆవులను అమ్మవద్దని నార్సింగి పోలీసు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్ సూచించారు. సోమవారం నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంతో వారు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చట్ట ప్రకారం ఆవులను అమ్మటం, వాటిని కోయటం లాంటివి చేయవద్దన్నారు. నార్సింగిలో కొనసాగే పశు సంతలో వాటిని విక్రయించవద్దన్నారు. ఇక్కడ నుంచి తీసుకుని వెళ్లే క్రమంలో ఆవులు ఎక్కడైనా లభిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, వ్యాపారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

అత్తాపూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యను అందించేందుకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులకు ఇన్ సర్వీసింగ్ ట్రైనింగ్ మంగళవారం నుంచి శనివారం వరకు జరుగుతుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్‌రాథోడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఐదు రోజుల శిక్షణకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరుకావాలన్నారు. ఈ శిక్షణలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంలు ఐదుగురు ఆర్పీలు పాల్గొంటారన్నారు. అత్తాపూర్‌లో ఇడిపై స్కూల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

గచ్చిబౌలి: విడాకులు తీసుకున్న ఓ యువకుడు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సక్రూ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కొకుంట్ల మండలం, అప్పంపల్లికి చెందిన విజయ్ చైతన్య(31) రాయదుర్గంలోని పోచమ్మబస్తీలో రెడ్డి సేన మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేసే చైతన్య ఆదివారం రాత్రి 9.30 గంటలకు తల్లి లక్ష్మీకళకు ఫోన్ చేసి మాట్లాడాడు. తర్వాత హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్వాహకుడు రంజిత్‌రెడ్డి పోలీసులకు సమాచారం అందించాడు. 10 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్న విజయ్ చైతన్యకు ఓ కూతురు. భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో గత సంవత్సరం విడాకులు తీసుకున్నాడు. కొన్నేళ్లుగా భార్యతో పడ్డ బాధలను డైరీలో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డైరీలోని కొన్ని పేజీలను గోడలకు అంటించినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి వెంకట్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


జాతీయ రహదారిలో చెరువును తలపిస్తున్న వర్షపు నీరు


పబ్లిక్ టాయిలెట్స్ వద్ద నిలిచిన నీరు, చెత్తాచెదారం

సమస్యలతో సతమతం

- జాతీయ రహదారిలో పేరుకుపోతున్న చెత్తాచెదారం, మట్టికుప్పలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


రహదారిలో గుట్టలుగా పోసిన మట్టి కుప్పలు

జియాగూడ: పురానాపూల్ నుంచి కార్వాన్ రామ్ సింగ్‌పురా వరకు గల జాతీయ రహదారి పూర్తిగా సమస్యలతో నెలకొంది. పురానాపూల్ నుంచి కార్వాన్ గుండా అత్తాపూర్, టోలీచౌకీ మీదుగా ఐటెక్ సిటీ వెళ్లడానికి ఈ దారి గుండా నగరంలోకి త్వరగా రావడానికి ఎంతో సౌకర్యంగా ఉన్నప్పటికీ సమస్యలు అంతేస్థాయిలో రాజ్యమేలుతున్నాయి.

వర్షం నీటి కాలువ మట్టితో..

జాతీయ రహదారి నిర్మాణ సమయంలో రోడ్డుకి ఇరు పక్కల వర్షపు నీరు వెళ్లడానికి కాలువలను నిర్మించారు. కాగా వాటిలో నిండిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వర్షపు నీరు వెళ్లక రోడ్డుపైన రోజుల తరబడి నిలిచి ఉంటుంది. నాలాలోని మట్టిని తొలగించినట్లయితే నీరు నదిలో కలిసేది.

రోడ్డుపైనే చెత్త, మట్టి కుప్పలు..

రహదారిలో రాత్రి సమయంలో లారీలలో చెత్త, ఇళ్లను కూల్చి వేసిన మట్టి దిబ్బలను తెచ్చిపోస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా లారీలపై జీహెచ్‌ఎంసీ బోర్డులు పెట్టి మరీ పోసి వెళ్తున్నారు. దీంతో 100 ఫీట్ల రహదారి 20 ఫీట్లకు మాత్రమే రాకపోకలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో వేగంగా వచ్చే వాహనాలు మట్టికుప్పల కారణంగా అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

నిరుపయోగంగా టాయిలెట్స్..

జాతీయ రహదారిలో పలుచోట్ల ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ నిలిచిన వర్షపు నీటి మధ్య, చెత్తాచెదారంతో నిరుపయోగంగా మారాయి. అలాగే వీటిని శుభ్రంగా ఉండడానికి, నీటి సౌకర్యం తగుచర్యలు తీసుకోకపోవడంతో పలు చోట్ల శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా ఆయా సంబంధిత విభాగాల వారు స్పందించి జాతీయ రహదారి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి..



మూసీనది పక్కన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఇమాంపురా బస్తీ రోడ్డులో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, చెత్తాచెదారం వల్ల దుర్వాసన, దోమల బెడదతో నానా ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

– మదిర సత్యనారాయణ, ఇమాంపురా ఎస్‌బీఎస్ అధ్యక్షుడు

‘ఎలిమ్ కెమ్’ ప్రొడక్ట్ ప్రారంభం


ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న పీవీ.కృష్ణ

నాంపల్లి: పర్యావరణ అనుకూలమైన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ‘ఎలిమ్ కెమ్’అనే ప్రొడక్ట్ సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఆవిష్కృతమైంది. ఎలిమ్ కెమ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ పీవీ కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రొడక్ట్‌ను ప్రారంభించారు. ఇది రసాయన ఉత్పత్తులను రూపొందించడానికి ఐఎస్ఓ, ఆర్‌అండ్‌డీ ధ్రువీకరించిందని పీవీ కృష్ణ తెలిపారు. పర్యావరణ అనుకూలమైన రసాయన సంరక్షణ పరిష్కారాల్లో కొత్త యుగంలోకి అడుగుపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫుడ్ డైరెక్టర్ టి.విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎండీ ఖలీల్, ప్రొఫెసర్ అన్నాగి రావు తదితరులు పాల్గొన్నారు.

సూది లేకుండానే రక్త పరీక్షలు


ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ ఎన్.రవికుమార్

నాంపల్లి: ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో సూది అవసరం లేని రక్త పరీక్ష పరికరాన్ని (ఏఐ బేస్డ్ డయాగ్నస్టిక్ టూల్) సోమవారం ప్రారంభించారు. ఈ పద్ధతి ద్వారా సుమారు పది రకాల పరీక్షలు సులభంగా అందుబాటులోకి వచ్చాయి. ఈ పరికరాన్ని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఏఐ బేస్డ్ డిజిటల్ ఆఫ్ ద్వారా రక్తహీనత ఎంత ఉందో కూడా తెలుసుకోవచ్చని, కేవలం 45 సెకండ్ల నుంచి 60 సెకండ్ల లోపే పరీక్షా ఫలితాలు కూడా వస్తాయని డాక్టర్ ఎన్.రవికుమార్ పేర్కొన్నారు. హార్ట్ రేట్, ఆక్సిజన్ ఆక్సిరేషన్, బడ్ల ప్రెజర్, డయాబెటీస్ గురించి తెలుసుకోవచ్చని వివరించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పద్ధతి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

పుస్తకాల ఆవిష్కరణ


తిరుమల వేంకటేశ్వరుని దిశానిర్దేశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అహోబిల జీయర్ స్వామి

నాంపల్లి: వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో సోమవారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు) రచించిన ‘తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం’స్వామి వారి 700 దివ్య లీలలు–రెండవ సంపుటి పుస్తకావిష్కరణ సభ, అన్నమాచార్య కీర్తనల బృందగానం పోటీలు, బహుమతుల ప్రదానోత్సవం సభ జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో అహోబిల జీయర్ స్వామి మంగళశాసనములతో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం పూర్వ కార్యనిర్వాహణాధికారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసంగించారు.

‘హృదయ గానం’ పుస్తకావిష్కరణ..


హృదయ గానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వంశీ రామరాజు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఇంటర్నేషనల్, జేవీ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి కోసూరి ఉమా భారతి రచించిన ‘హృదయ గానం’పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీనటి ఉమాభారతికి వంశీ–ఎన్టీఆర్ ప్రవాస భారతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాల చారి మాట్లాడుతూ..యమగోల చిత్రంలో సీనియర్ ఎన్టీఆర్‌తో కలిసి నటించిన ఉమా భారతికి పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయబాబు, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, జేవీ పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు వలబోజు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుడ ప్రసాదం పంపిణీ


శేషాచారి

జియాగూడ: జియాగూడ రంగనాథ దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆలయ ప్రతినిధి శేషాచారి సోమవారం తెలిపారు. గరుడ ప్రసాదం స్వీకరించడం వల్ల సంతానం లేని వారికి సంతానం, పలు వ్యాధుల పీడితులకు ఉపశమనం, కాలసర్ప దోషాలు తొలుగుతాయన్నారు. గరుడ ప్రసాదానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.


తాగునీటి సమస్యను పరిష్కరించాలి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ధన్‌రాజ్

అబిడ్స్: తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ నియోజకవర్గంలోని గోషామహల్, హిందీనగర్, నాంపల్లి, జాంబాగ్, దారుసలాం, ధూల్‌పేట్, మంగళ్‌హాట్, ఆగాపురా తదితర ప్రాంతాల్లో ఉన్న తాగునీటి సమస్యలను ఇతర డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ధన్‌రాజ్ తన దృష్టికి తెచ్చిన తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, పైప్‌లైన్ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

ఆసిఫ్‌నగర్‌లోని వైన్స్, బార్‌లను తరలించాలి

గోల్కొండ: సామాన్య ప్రజలకు తలనొప్పిగా మారిన వైన్స్, బార్ షాపులను తొలగించాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఆయన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికృష్ణను కలిశారు. ఈ సందర్భంగా ఆయన నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్‌లో వైన్స్, బార్‌ల కారణంగా ఏర్పడుతున్న సమస్యలను కమిషనర్‌కు వివరించారు. గత నెలలో ఓ వైన్స్ షాపులో ఓ వ్యక్తి మృతి చెందడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారన్నారు. ఇక్కడ ఉన్న వైన్స్ షాప్‌లతో పాటు బార్ వద్ద మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు గొడవలు జరుగుతున్నాయని, రోడ్డుపైన స్థానికులు నడవలేని పరిస్థితి ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రానికి భారీ మొత్తంలో వైన్స్, బార్ షాపుల వల్ల రాబడి వస్తుందని కానీ వీటి కారణంగా వేలాది మందికి తలనొప్పిగా మారాయన్నారు. నవంబర్ వరకు గడువు ఉన వైన్స్ షాపును ఇక్కడ నుంచి తరలించాలని ఆయన కోరారు. ఆయన వెంట దత్తాత్రేయనగర్, ఆసిఫ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.


విద్యార్థులను అభినందించిన చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి

మహిళలను గౌరవించినప్పుడే ఎదుగుదల

రాయదుర్గం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను సైయింట్ సంస్థ సోమవారం అభినందించింది. నానక్‌రాంగూడలోని సైయింట్ సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించాలన్నారు. కాగా సైయింట్ సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో దత్తత తీసుకొన్న 33 ప్రభుత్వ పాఠశాలల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను పిలిపించి అభినందించారు. ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులు , పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అవసరాలను తీర్చడంలో సైయింట్ ముఖ్య భూమిక పోషించింది.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్

చార్మినార్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ టి. వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్‌కు చెందిన ఇంజినీరింగ్ సమస్యలపై రెండు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, దోమల బెడద, రోడ్లు, వీధి దీపాలు, అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామా రావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు


ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్‌ను కలిసిన ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్ విభాగం సంపూర్ణ విజయవంతమైయ్యిందని ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ అన్నారు. కార్వాన్ కాంగ్రెస్ నియోజకవర్గం యువజన నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్ సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, కొత్తగా ట్రాఫిక్ ఐలాన్స్‌ల నిర్మాణం ఆవశ్యకతపై ఆయనకు వివరించారు. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, రేతిబౌలి, టూంబ్స్ చౌరస్తా, లంగర్‌హౌస్, గోల్కొండ బంజారి దర్వాజ తదతర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని ఇమ్రాన్ అలీఖాన్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఇది పూర్తిగా విజయవంతం అయ్యే దశలో ఉన్నాయన్నారు. నగర కమిషనర్ ప్రవేశపెట్టిన రోప్, ఫ్రీ లెఫ్ట్ విధానాల వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ప్రత్యేక అధికార బృందాన్ని ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్‌లు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడ ఎక్కువ సిబ్బంది నియమిస్తామన్నారు.

సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారులు



గెలుపొందిన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: ఏపీ బ్యాండి అసోసియేషన్ నిర్వహించిన 7వ జాతీయ బ్యాండి ఫెడరేషన్ కప్–2025లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. 4 బంగారు పతకాలు, 2 వెండి పతకాలతో 26 పాయింట్లను సాధించి మొదటిస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బ్యాండి అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ, ఆంధ్రా, గుజరాత్, హరియాణా, యూపీ, కర్ణాటక, కేరళ వంటి వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో ప్రతిభను చాటడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లవ్‌కుమార్ జాదవ్, కోచ్ నసిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన వ్యర్థాలు మళ్లీ కాల్వల్లోకి..


కాల్వ నుంచి తొలగించిన మట్టిని అక్కడే పోసిన దృశ్యం

ఫిలింనగర్: వానాకాలానికి ముందు వరద నీటి కాల్వల్లో, నాలాల్లో చేయాల్సిన డీసిల్టింగ్ పనులు ఈ పాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ జూబ్లీహిల్స్ డివిజన్‌లో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరో వైపు వరద నీటి కాల్వల్లో నుంచి తొలగించిన వ్యర్థాలను వెంటనే అక్కడి నుంచి తరలించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తుండటంతో వర్షాలు వచ్చి ఆ వ్యర్థాలు మొత్తం మళ్లీ అదే వరద నీటి కాల్వల్లోకి వెళ్తున్నాయని కాలనీవాసులు ఫిర్యాదులు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 71లో నవ నిర్మాణ్‌నగర్ కాలనీలో వరద నీటి కాల్వల నుంచి తొలగించిన వ్యర్థాలు అక్కడే కుప్పలుగా పోశారు. వీటిని తొలగించాలని పలుమార్లు సిబ్బందికి కాలనీవాసులు సూచించినా పట్టించుకోవడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద నీటి కాల్వల్లోంచి తొలగించిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

గుడిమల్కాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో దీపక్‌రెడ్డి, దేవర వంశీ

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి ఈసారి సైతం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని బీజేపీ నాయకుడు దేవర వంశీ కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు ఎల్.దీపక్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా దేవర వంశీ, దీపక్‌రెడ్డి గుడిమల్కాపూర్ డివిజన్‌లోని సమస్యలను ఆయనకు వివరించారు. వీడీసీసీ రోడ్లు, రోడ్ల విస్తరణ, కొత్త డ్రైనేజీ పైపులైన్ల ఆవశ్యకతపై కేంద్ర మంత్రికి వివరించారు. తాగునీటి సరఫరాకు కొత్త లైన్లు వేసి ప్రస్తుతం నెలకొని ఉన్న నీటి కొరతను తీర్చాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తుందన్నారు. రాష్ట్రాలకు కేటాయిస్తున్న వేలాది కోట్ల నిధులు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాలకు కేటాయించబడుతున్నాయన్నారు. రోడ్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు విడుదల చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గుడిమల్కాపూర్‌లో అభివృద్ధి పనులు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి


జెడ్‌సీకి వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ వెల్దండ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని కమలాపురికాలనీతో పాటు ఫిలింనగర్ 18 బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సోమవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి ఎక్కడెక్కడ పనులు పెండింగ్‌లో ఉన్నాయో వాటి జాబితాను అందజేశారు. ఈ పనులపై ఆయన అధికారులతో చర్చించారు. కమలాపురికాలనీ, పద్మాలయా అంబేద్కర్‌నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డులలో నూతనంగా సీసీ రోడ్లు వేయాలని, దుర్గాభవానీనగర్‌లో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కార్పొరేటర్‌కు హామీనిచ్చారు.